క్లుప్తంగా

12 నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజులపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీవో ఎస్.జగదీష్ గురువారం తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత, డంపింగ్ యార్డ్‌లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఎరువులను తయారు చేయడం, సైడ్ కాలువల్లో మురుగు తొలగింపు, గ్రామాల్లో నీటి సాలభ్యత, వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. శిక్షణకు డైరెక్టర్‌గా ఎంపీడీవో, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఈవోపీఆర్‌డీ, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం

అమరావతి: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి అమరావతి సీపీఎం పార్టీ తరపున సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు సీపీఎం పార్టీ కార్యదర్శి బి.సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం సీనియర్ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులుగా, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన మృతి పార్టీకి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. విద్యార్థి నాయకుడిగా నిబద్ధతతో పనిచేసి పశ్చిమబెంగాల్ సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడిగా బెంగాల్ అభివృద్ధికి జీవితాంతం కృషి చేశారన్నారు. పార్టీ ఆయన ఆశయాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మొహిద్దీన్‌వలి పాల్గొన్నారు.

ఏడీఈ శ్రీనివాసరావుకు సత్కారం



సత్తెనపల్లి: విద్యుత్ శాఖలో ఏడీఈగా సేవలు అందిస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన బత్తుల శ్రీనివాసరావును ఆర్యవైశ్య నాయకులు, వాకింగ్ క్లబ్ సభ్యులు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది చలువాది చిన సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీనివాసరావు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయడమే కాక ప్రచారం చేసుకోకుండా అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఎంతో మందికి ఆర్థిక సహాయం అందించిన మానవతావాది అని కొనియాడారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాలతో శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, అన్నం కృష్ణ, వాకింగ్ క్లబ్ సభ్యులు శౌరిరెడ్డి, కాపుగంటి రత్తయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి



బండారు నరేంద్ర(ఫైల్)

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన పట్టణంలోని అమరావతి మేజర్ కాలువ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బండారు నరేంద్ర (29) మాంసం కోసి పట్టణంలోని రెస్టారెంట్లకు అందిస్తుంటాడు. ఈ క్రమంలో పొట్టేలు తోలు విక్రయించేందుకు స్నేహితుడు అప్పాపురం భూపతితో కలిసి సత్తెనపల్లి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇరువురు వెళుతుండగా అమరావతి మేజర్ కాలువ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో బండారు నరేంద్ర మృతి చెందాడు. స్నేహితుడు భూపతికి తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అభం శుభం తెలియని ఆడపిల్లలతో ఎలా జీవించాలి, తమకు దిక్కెవరు దేవుడా అంటూ రాజేశ్వరి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడికి గురి చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయండి

కారెంపూడి: పోయిన సెల్ ఫోన్‌ను రికవరీ చేసి పోగొట్టుకున్న వ్యక్తి గుంటూరుకు చెందిన కోసూరు కృష్ణసాయికి కారెంపూడి ఎస్‌ఐ కె.అమీర్ గురువారం రాత్రి అందించారు. గత నెల 16వ తేదీన కృష్ణ సాయి కారెంపూడికి పని నిమిత్తం వచ్చి టీ స్టాల్ వద్ద తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అతనిచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దర్యాప్తు చేసి సెల్ ఫోన్‌ను రికవరీ చేసి బాధితునికి అందించారు. ఎవరైనా సెల్ పోగొట్టుకున్నట్లయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ అమీర్ సూచించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లోనూ రాజకీయాలు

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో చోటుకు పైరవీలు
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన కొందరు ప్రధానోపాధ్యాయులు
- కూటమి నాయకులు, సానుభూతిపరులు ఎన్నికకు సహకారం
- నియోజకవర్గంలో 226 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తి
- కోరం లేక రామకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాలలో నిలిచిన ఎన్నిక



కండ్లకుంటలో ఎన్నికల ప్రక్రియపై సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు



సుగాలీ కాలనీ జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియ



గురుకుల పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ప్రమాణం చేస్తున్న షేక్ జాన్‌సైదా, హేమలత



కండ్లకుంట ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సభ్యులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అంశంలోనూ అనవసర రాజకీయకంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే పథకాల విషయంలో కూటమి నాయకులు హంగామా చేస్తుండగా .. రాజకీయాలకు పూర్తి దూరంగా నిర్వహించాల్సిన ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో సైతం కూటమి నాయకులు, సానుభూతిపరులు పదవుల్లో ఉండే విధంగా పైరవీలు చేశారు. దీనికి కొందరు ప్రధానోపాధ్యాయులు అత్యుత్సాహం చూపగా మరి కొందరు టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత విద్య నిర్బంధ హక్కులోని సెక్షన్ 21 ప్రకారం పాఠశాలలో విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పదవీకాలం ఈ ఏడాది జులైతో ముగియడంతో కూటమి ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్‌ఎంసీ)గా పేరు మార్చి గురువారం ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలు పూర్తిగా ఏకపక్షంగా చేసుకున్నారు. కొందరు హెచ్‌ఎంలు ప్రచార సాధనాలను సైతం అనుమతించకుండా చోటామోటా నేతలతో కలిసిపోయి ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం గమనార్హం. చేతులెత్తే పద్ధతిలో ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, మండలంలో మొత్తం 91 పాఠశాలలకు గాను 90 పాఠశాలల్లో, ముప్పాళ్ళలో 35 పాఠశాలల్లో, రాజుపాలెంలో 55 పాఠశాలల్లో, నకరికల్లులో 46 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర పాఠశాలలో కోరం కాకపోవడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచి పోయింది. ఎస్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం తొలి సమావేశాలను నిర్వహించారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలల చైర్మన్లు ఇలా..

సత్తెనపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లుగా బలిజేపల్లి ఎస్తేరు రాణి (గుడిపూడి), మంచి సంధ్యారాణి (నందిగామ), కాకర్ల సాంబయ్య (పెద్దమక్కెన), కొర్నే వెంకటేశ్వర్లు (నందిగామ), గరికపాటి వసంతలక్ష్మి(అబ్బూరు), పీఎస్‌కే జానీ బాషా(కొమెరపూడి), సీహెచ్ వెంకటేశ్వరరావు (బృగుబండ), ఎం.సుబ్బారావు (దూళ్ళిపాళ్ల), పి.కోటేశ్వరరావు (వెన్నాదేవి), మానుకొండ నాగయ్య (రెంటపాళ్ల), ఎం.పద్మనాభప్రసాద్ (కట్టమూరు), పుట్టి లక్ష్మీనారాయణ (లక్కరాజుగార్లపాడు), ఎస్.రత్నబాబు (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికలు రామకృష్ణాపురం), పల్లపు పద్మ (బాలికలు, సత్తెనపల్లి), షేక్ రహంతున్నీసా(సుగాలికాలనీ, సత్తెనపల్లి), ఎం.శంకర్ (కేజీబీవీ, సత్తెనపల్లి), పి.సాగర్ (ఎంయూపీఏబీ బాలికలు సత్తెనపల్లి)లు ఎన్నికైనట్లు ఎంఈవో ఏ శ్రీనివాసరావు తెలిపారు.

54 పాఠశాలల్లో పూర్తయిన ఎన్నికలు

అమరావతి: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. అమరావతి మండలంలోని 40 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో 54 పాఠశాలల్లో ఎన్నిక పూర్తయింది. మండల విద్యా శాఖాధికారులు వై.ప్రసాదరావు, శివబాబుల ఆధ్వర్యంలో 30 పాఠశాలల్లో ఏకగ్రీవంగా 24 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. వైకుంఠపురం ఎంపీయూపీ పాఠశాలలో కోరం పూర్తికాక ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈవో శివబాబు తెలిపారు.

సమన్వయంతో పనిచేసి ఫలితాలు సాధించాలి

నకరికల్లు: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో విద్యా కమిటీలు సమన్వయం చేసుకొని పనిచేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల, కండ్లకుంట గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలను పర్యవేక్షించి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాజీవ్‌గాంధీ వికలాంగుల ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు 6 ఉన్నత పాఠశాలలు, 6 యూపీ, 31 ఎలిమెంటరీ పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరుశాతం పెంపులో సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లును కండ్లకుంట ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంఎస్‌వో పి.పద్మారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అన్ని పాఠశాలల్లోను అధికార పార్టీ వర్గీయులే కైవసం చేసుకున్నారు. మండలంలో 42 ఎంపీపీఎస్, 7 ఎంపీయూపీఎస్, 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలకు చైర్మన్, వైస్ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. క్రోసూరు మోడల్ స్కూల్ చైర్మన్‌గా షేక్ మహ్మద్ రఫీ, వైస్ చైర్మన్‌గా కె.అంజలి ఎంపికయ్యారని ప్రిన్స్‌పాల్ మేరీ సుజన్ తెలియజేశారు. అన్ని పాఠశాలల్లో ఆయా హెచ్‌ఎంలు సమావేశం ఏర్పాటు చేసి నూతన సభ్యులు, తాము, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తామని తెలిపారు.

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు

అచ్చంపేట: మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ముగిశాయి. మొత్తం 44 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 6 జిల్లా పరిషత్, ఒక కేజీబీవీ, ఒక ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం, 2 ఆర్సీఎం స్కూల్స్‌తో కలిపి మొత్తం 64 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో 15 పాఠశాలల్లో ఎన్నికలు పోటాపోటీగా జరగగా మిగిలిన పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కోరం లేక వాయిదా వేశారు. ప్రతి గ్రామంలోను ఎన్నికలు టీడీపీ కనుసన్నల్లో జరగడం గమనార్హం. పోటీ ఉన్న పాఠశాలల్లో, వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో ఉన్నా టీడీపీ హవానే నడిచింది. మండలంలో 1200 మంది విద్యార్థులున్న అతి పెద్ద జెడ్పీ హైస్కూలులో చైర్మన్‌గా రాయిడి రాజారావు, వైస్ చైర్మన్‌గా తాళ్లూరి మార్తమ్మలు ఎన్నికయ్యారు. చిగురుపాడు ఎస్సీ ప్రాథమిక పాఠశాలకు చైర్మన్‌గా జానపాటి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా దుద్దుల విజయేంద్రబాబు, ఎన్నికయ్యారు. అయితే ఎక్కడా ఎలాంటి గొడవలు జరగలేదు. లాలూచీలతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

రాజుపాలెం: మండలంలోని అన్ని పాఠశాలల్లో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 43 ప్రాథమిక పాఠశాలలకు, 5 ప్రాథమికోన్నత, 6 జిల్లా పరిషత్ పాఠశాలలకు, ఒక కేజీబీవీకి ఎన్నికలు నిర్వహించగా చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు ఆరుద్ర సురేష్, కోటనెమలిపురి - నేరెళ్ల గురవయ్యను, పెదనెమలిపురి - బొట్టు శ్రీనివాసరావును, ఇనిమెట్ల -గడ్డిపర్తి నాగరాజు, రాజుపాలెం- పెద్దింటి వీరాంజనేయులు, గణపవరం - పల్లపాటి శ్రీనివాసరావులను చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రతి పాఠశాలలో సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి సమావేశం ఏర్పాటు చేశారు.

ఏకగ్రీవమైన ఎన్నికలు

బెల్లంకొండ: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎటువంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిసినట్లు ఎంఈవో బాలసుందరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల చైర్మన్‌గా షేక్ రబ్బాని, వైస్ చైర్మన్‌గా గడిపర్తి రాములమ్మ, పాపాయపాలెం జెడ్పీ స్కూల్ చైర్మన్‌గా ఓర్సు మల్లిఖార్జునరావు, వైస్ చైర్మన్‌గా విజయకుమారి, చంద్రాజుపాలెం జెడ్పీ స్కూల్ చైర్మన్‌గా బి.నరసింహారావు, మేరి ఎన్నికయ్యారు. కేజీబీవీ చైర్మన్‌గా కె.రమాదేవి, దైవవాణి, వెంకటాయపాలెం యూపీ స్కూల్ చైర్మన్‌గా దీపాల కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా సంగు ప్రియాంక, నందిరాజుపాలెం చైర్మన్‌గా దామవరపు పెద ఆదాం, వైస్ చైర్మన్‌గా జొన్నలగడ్డ దీపిక ఎన్నికయ్యారు.

తల్లిదండ్రుల చొరవతో విద్యాభివృద్ధి

పెదకూరపాడు: తల్లిదండ్రుల చొరవతోనే విద్యాభివృద్ధి జరుగుతుందని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఎన్నికలను గురువారం నిర్వహించారు. పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా హిదాయతుల్లా, వైస్ చైర్మన్‌గా కె.విజయకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపుకు నూతన కమిటీ కృషి చేయాలన్నారు. అర్తిమల్ల రమేష్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.రాజు, హెచ్‌ఎం రమణ, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, స్థానిక నాయకులు, జిల్లా టీడీపీ నాయకురాలు ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాజమాన్యం కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు.



ఏపీ మోడల్‌స్కూల్ చైర్మన్ మహ్మద్ రఫీ, వైస్ చైర్మన్ కె.అంజలి



హిదాయతుల్లాను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



దమ్మాలపాడు జెడ్పీ పాఠశాలలో...

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మొత్తం 35 పాఠశాలలకు ఎన్నికలు ముగిసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో కే శ్రీనివాసరావు తెలిపారు. ముప్పాళ్ళ జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా పీ సాంబశివరావు, వైస్ చైర్మన్‌గా చిలకా శాంతకుమారి, దమ్మాలపాడు జెడ్పీ పాఠశాల చైర్మన్‌గా సూరంశెట్టి సతీష్, వైస్ చైర్మన్‌గా చావా శాంతకుమారి, బొల్లవరం- చైర్మన్‌గా బక్కా సురేష్, వైస్ చైర్మన్ ఎన్.కళ్యాణి, నార్నెపాడు- చైర్మన్‌గా ఆరుద్ర వీరాంజనేయులు, వైస్ చైర్మన్‌గా పాలడుగు శివపార్వతి, మాదల-చైర్మన్‌గా సాంబశివరావు, వైస్ చైర్మన్‌గా షేక్ గౌసియాబిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా కమిటీల సభ్యులతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికలను రూరల్ సీఐ ఎం.రాంబాబు, ఎస్సై పీ హజరతయ్యలు పర్యవేక్షించారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు పెదకూరపాడులో హాల్ట్ కల్పించాలి

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో రేపల్లె-సికింద్రాబాద్ పాసింజర్‌తోపాటు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పిస్తే రాజధాని ప్రాంత ప్రయాణికులకు ఉపయోగం ఉంటుందని కోరుతూ ఇంటింట సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రముఖ జర్నలిస్టు, అభ్యుదయ రచయితల సంఘం నాయకురాలు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ ప్రారంభించారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో పార్టీలకతీతంగా పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె పాసింజర్ పెదకూరపాడులో హాల్ట్ కోరుతూ సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. జిల్లా రైతు సంఘ నాయకులు శేషారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్‌అక్బర్‌ల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. వివిధ పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో పెదకూరపాడు నుంచి హైదరాబాద్ వెళుతుంటారని దీన్ని దృష్టిలో పెట్టుకుని రైళ్ల హాల్ట్‌ను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న శరత్‌చంద్ర, ప్రజాసంఘాల నాయకులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు


సత్తెనపల్లి: ప్రభుత్వంతో చర్చించి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో గురువారం పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు బొడ్డు రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉండి కృషి చేద్దామన్నారు. డీఏ, పీఆర్సీ ఎరియర్స్, ఈహెచ్‌ఎస్, నామినీ తదితర వాటిపై చర్చించారు. జిల్లా కార్యవర్గ సమావేశాలను కేవలం జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా జిల్లా పరిధిలోని వేర్వేరు మండలాల్లో నిర్వహించడం అభినందనీయమని, అలా చేయడం వలన ఆయా శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మానవ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆదియ్యలు మాట్లాడారు. ఈ సందర్భంగా 8 మండల శాఖలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పలు సమస్యలపై చర్చించారు. కళాకారులైన కొత్తూరు రామకోటయ్య, రమాదేవి, సత్తెనపల్లి నాసరయ్య, ఔత్సాహిక కళాకారులైన లక్ష్మయ్య, బెజ్జగం రవికుమార్‌లు కళా ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం కళాకారులను సత్కరించారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు జక్కుల లక్ష్మీనారాయణ, కెబీఆర్‌జే ప్రసాద్, రంగారెడ్డి, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు

ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

నకరికల్లు: రైతు సేవా కేంద్రాల సిబ్బంది ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. నకరికల్లులోని రైతు సేవా కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన కల్పించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలకు సంబంధించిన నిర్దిష్ట సమాచారాన్ని నిర్ణీత రుసుము చెల్లించి రాతపూర్వకంగా తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. ఏవో కె.దేవదాసు ఈ పంట ప్రక్రియను వివరించారు. ఈ పంట నమోదు ద్వారా వ్యవసాయ శాఖ తరపున ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. సెప్టెంబర్ 15వ తేదీకల్లా ఈ పంట నమోదు ముగుస్తుందని వాస్తవ సాగుదారుల వివరాలు మాత్రమే పొందుపరచాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఈ పంట నమోదు ఆవశ్యకతను వివరిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు

వితంతు పింఛన్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు

రాజుపాలెం: ఎస్సీ, ఎస్టీ పిల్లలు, వృద్ధులు, మహిళలు, ప్రత్యేక అవసరాలు గల వారు, అగ్ని ప్రమాద బాధితులు, ప్రకృతి వైపరీత్య బాధితులు ఉచిత న్యాయ సహాయానికి అర్హులని న్యాయ విజ్ఞాన సదస్సు పారాలీగల్ వలంటీర్ కోట బాబూరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సత్తెనపల్లి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగశ్రీనివాసరావు సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో పారాలీగల్ వలంటీర్ కోట బాబూరావు మాట్లాడుతూ వితంతు పింఛన్‌పై అవగాహన కల్పించారు. పేదరికం కారణంగా న్యాయం అందుబాటులో లేనివారికి ఉచిత న్యాయ సహాయం చేస్తామని తెలిపారు. సమాజంలో మహిళలు, పిల్లలు, వృద్ధులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదరణ కోల్పోయిన వృద్ధులు ఎవరైనా మండల లీగల కమిటీని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సల్పకాలిక, మధ్యస్థ రకాల వరి విత్తనాలు నాటుకోవాలి

ఏవో వేణుగోపాల్

క్రోసూరు: వరి సాగు చేస్తున్న రైతులు స్వల్పకాలిక, మధ్యస్థ రకాల వరి విత్తనాలు నాటుకోవాలని ఏవో వేణుగోపాల్ గురువారం తెలిపారు. మండలంలోని పీసపాడులో పత్తి క్షేత్ర సందర్శనకు వచ్చిన ఆయన వరి సాగు చేసే రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో వరి 2024 ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 3,480 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సాగర్ నీటి మట్టం పూర్తిస్థాయిలో ఉన్నందున దిగువకు నీళ్లు విడుదల చేస్తున్న క్రమంలో వరి పూర్తిస్థాయిలో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని, విత్తనాల కోసం ప్రైవేటు డీలర్లను సంప్రదిస్తున్నారన్నారు. అయితే ఇప్పటికే కొందరు బావులు, బోర్ల కింద నార్లు పోసారన్నారు. + రైతులు స్వల్పకాలిక, మధ్యస్థ వరి విత్తనాలయిన ఎంటీయూ 1224, 1282, 1210, 1121, ఎస్ఎల్ఆర్ 3354, 3238, 34449, జేజీఎల్ 384, 27356, కేఎన్ఎం 733, 1638 రకాలను నాటుకోవాలన్నారు. అలాగే సన్న రకాలయిన అంకుర్‌సోనా, ఇందిర, వసుంధర, కృష్ణవేణి వంటి రకాలను కూడా సాగు చేయొచ్చని తెలిపారు. ఏపీ సీడ్స్ ద్వారా సబ్సిడీపై అందించుటకు ఎంటీయూ 1224, 1121, ఎస్ఎల్ఆర్ 34449, కేఎన్ఎం 1638 రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జేజీఎల్ 384 వరి విత్తనం తెలంగాణ రాష్ట్రానికి చెందినదని ఆ రకం లభ్యత తక్కువగా ఉన్నట్లు చెప్పారు. కావున రైతులు ఏదో ఒక రకంపై ఆధారపడకుండా దిగుబడి, మార్కెట్ ధర, నాణ్యత తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని సాగు చేయాలని కోరారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తి పంటకు మంచిదని, పల్లపు ప్రాంతాల్లో పత్తి సాగు చేస్తున్న రైతులు నీళ్ల పొలాల నుంచి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీళ్ల తీసివేసిన తరువాత బూస్టర్ డోస్ ఎరువులు వాడాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత అంతరం సేద్యం చేసినట్లయితే తేమ త్వరగా ఆరిపోయి మొక్కలు కోలుకుంటాయని తేమ అధికంగా ఉంటే తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పవన్, రైతులు పాల్గొన్నారు.



పత్తి క్షేత్ర సందర్శనలో ఏవో వేణుగోపాల్

యాజమాన్య పద్ధతులతో బహుళ ప్రయోజనాలు

నకరికల్లు: సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమంలో యాజమాన్య పద్ధతులపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638 రకం వరి రకాలు సాగు చేసుకోవచ్చని సూచించారు. విత్తనాల కొనుగోలులో కేజీకి రూ.5 చొప్పున ప్రభుత్వం రైతులకు రాయితీ కల్పిస్తుందని అన్నారు. విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణతో విషజ్వరాలు దూరం

రెంటాల(రెంటచింతల): మన నివాస పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని, దీంతో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రావని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రెంటాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. విద్యార్థులు ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి వంటి లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీర వెంకట వీరయ్య, ఆరోగ్య సిబ్బంది మనీషా, ఉపాధ్యాయులు వెన్నా బుచ్చిరెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునికి దేహశుద్ధి



కారెంపూడి: ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు తెలపడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసిన ఘటన కారెంపూడి మోడల్ స్కూల్లో గురువారం చోటు చేసుకుంది. తమ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బోరుగడ్డ రవికుమార్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని కొందరు విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు సుమారు 20 మంది ఉపాధ్యాయునిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనికి దేహశుద్ధి చేశారు. సమయానికి పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై ఎంఈవో పి.రవికుమార్ గురువారం విచారణ నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రిపోర్టును పై అధికారులకు పంపుతానని పేర్కొన్నారు. ఎస్ఐ కె.అమీర్ పాఠశాలలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిరాకరించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయునిపై విద్యాశాఖ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.